


# పరదేశీ కథలు
## - చిట్టే సిద్ధ లలిత



- 110 -

## సుబ్బరత్న కథ

~~~~~~~~~~~~

**అది కువైట్ సిటీలోని ముర్గాబ్ ఏరియా.** జన సమ్మర్ధం కల ప్రాంతం. సాయంత్రమయితే చాలు రోడ్లకిరువైపులా బారులు తీరిన అంగళ్ళతో కస్టమర్లను ఆకర్షించే లైట్ల వెలుగులతో జిగేల్ మని మెరుస్తుంటుంది.

పండ్లు కూరగాయల మార్కెట్ ఒకవైపు, చేపలు మాంసం మార్కెట్ లాంటివి మరో వైపు, మధ్యలో సుగంధ ద్రవ్యాల కొట్లు లాంటివి ఆ ప్రాంతంలో చాలా వున్నాయి. వ్యాపార లావాదేవీలకు శుక్రవారం అనువైనది. ఆరోజు అందరికీ సెలవు కాబట్టి ఇంట్లో పనిచేసేవాళ్ళు కూడా కొన్ని గంటల స్వేచ్ఛను అనుభవించి ఆనందాన్ని ప్రోగు చేసుకోవడానికి పొలోమని వచ్చేస్తారు. శుక్రవారం సాయంత్రం ఆ ప్రాంతమంతా ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండిపోతుంది. ప్రపంచం నలుమూలలనుండీ రెక్కలు కట్టుకుని ఎగిరొచ్చిన రకరకాల జనాలు మాట్లాడే వివిధ భాషలతో ఆ ప్రాంతం గమ్మత్తుగా వుంటుంది.

ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు కలుసుకునే చోటు కూడా అదే. దేశాలకు, భాషలకు, మతాలకు అతీతమైన మానవీయ బంధాలవి. పరదేశంలో ఒంటరి పక్షులు పంచుకునే స్నేహ సంబంధాలవి.

"ఓమ్మీ నాగమణీ.. వక్కాకు తెచ్చినావా, లేదా. నాల్రోజుల్నుండీ నమలక పిచ్చి పట్టినట్టుండాదే" అంది గారపళ్ళు బయటపెట్టి నవ్వుతూ లచ్చిందేవి.

"నీయమ్మ నీ వక్కాకుకు వచ్చినాయా తిప్పలు అక్కా. ఊళ్ళో ఘోరం జరిగిపోయి మేము ఏడుస్తుంటే" అనింది నాగమణి. "ఏం జరిగిందిమే. ఏంది కథ చెప్పు" ఆసక్తిగా అడిగింది లచ్చిందేవి.

"మా చెల్లెలు సుబ్బరత్న వుండాది కదా. ఆయమ్మి మొగుడు ఉరి వేసుకొని సచ్చినాడు. నెలరోజులయింది. కసుగాయలు ముగ్గురు పిల్లోళ్ళను ముందు పెట్టుకుని ఆయమ్మి ఏడుస్తాంటే గుండెలు పగిలిపోతాండాయి.
~~~~~~~~~~~~

ఫోను చేసి ఒకటే ఏడస్తాంది."

"అయ్యయ్యో. ఎంత ఘోరం జరిగిందిమే. ఎందుకు ఆయబ్బి ఉరేసుకున్నాడు. ఎందుకంత కట్టం వచ్చింది..?"

"మన పిల్ల తప్పేమీ లేదు. వాళ్ళ అమ్మతో ఆస్థి గురించి గొడవొచ్చి అమ్మ కొడుకుల మధ్య మాటకు మాట పెరిగి వాడు తొందర పడినాడు. ఉరేసుకునేముందు భార్య బిడ్డల ముఖం కూడా చూడలేదు వాడు. వాడేమో హాయిగా పోయినాడు. ఇప్పుడు ఈయమ్మి జీవితం ఏం కావాల. పిల్లోళ్ళను ఎలా సాకి సదివించి పెద్ద చేస్తాది చెప్పు. ఆ గయ్యాళి అత్త ఆస్థిని కొడుక్కే ఇవ్వలేదు. ఇప్పుడు ఈయమ్మికి ఇస్తాదా. ఇంట్లో పెట్టుకుని తిండి పెడితే గొప్పే. అయినా నరకంలే. ఇప్పుడు మనమే ఏదో ఒక దారి చూపించకపోతే పిల్లోళ్ళు పాడయిపోతారు కదా" అంది నాగమణి దిగులుగా.

"అయ్యో ఇంతపని జరిగిందా. నాకు తెలియనే తెలియదే. అయినా నీకేమిలే నాగమణీ తెలివయినదానివి. ఈ ముర్గాబ్ లో శుక్రవారం వక్కాకు అమ్మి లచ్చలు సంపాదించినావు. చెల్లెలికి ఏదో ఒక మార్గం చూపించకపోతావా" చెప్పింది లచ్చిందేవి తమలపాకులకు సున్నం రాసుకుంటూ.

"లేదు లచ్చిందేవక్కా ఇప్పుడు నావల్ల కాదు. మొన్నే రెండు లచ్చలు అప్పుచేసి నా కొడుకు రమణని పిలిపించాను. వాడికి ఇంకా పని దొరకలేదు. వాడు రూములో ఖాళీగా కూర్చుని తిని టివి చూస్తున్నాడు. చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నాను. అందుకే నువ్వు మీ సేటుకు చెప్పి మీ ఇంట్లోకి వీసా తీస్తావనే ఇంత కథ ఓపిగ్గా చెప్పినాను. ఈ సాయం చెయ్యి. నీకు పుణ్యం వుంటాది. నీ పేరు చెప్పుకుని ఆయమ్మి బతుకుతాది. పిల్లోళ్ళను సాక్కుంటాది" అంది అర్థింపుగా నాగమణి.

"మా ఇంట్లో ఖాళీ ఎక్కడ వుండాది నాగమణీ. ఈ మధ్యనే సేటు కావాలంటే రెడ్డిపల్లి నుండి ఇద్దర్ని పిలిపించినాను. ఊరికే కాదనుకో. అక్కడ వీసా చేరగానే మా అమ్మ చేతికి లచ్చరూపాయలు ఇచ్చి వీసా తీసుకున్నారు. నీకు తెలియందేముంది. వీసా ఊరికే రాదు కదా" అంది వక్కాకు నములుతూ.

అవసరం కాబట్టి తగ్గినా పరవాలేదు అనుకుంది నాగమణి.

"అదికాదక్కా ఆయమ్మికి నిండా ఇరవైరెండేళ్ళు లేవు. మొగుడు చచ్చిన ఆడది ఊళ్ళో ఎలా బతుకుతాది చెప్పు. పిల్లోళ్ళను మాయమ్మ దగ్గర వదిలి వస్తాది. నీ ఋణం వుంచుకోదులే. నువ్వే సాయం చెయ్యకపోతే ఎట్ట చెప్పు" దీనంగా ముఖం పెట్టింది నాగమణి.

"సరేమ్మే.. నువ్వు చెబుతున్నావు కాబట్టి వీసా తీస్తాను. యాభైవేలిచ్చి వీసా తీసుకోమను, అంతకుమించి ఒక్క రూపాయి తగ్గేది లేదు" ఖచ్చితంగా చెప్పింది లచ్చిందేవి.

ఇక ఎక్కువ మాట్లాడితే లచ్చిందేవి మొండికేసి కాదంటాదని "సరేలే లచ్చిందేవక్కా అలాగే ఇస్తాములే. ఆయమ్మి వచ్చినాక పని అదీ నువ్వే నేర్పించి మంచి చెడ్డ చూసుకోవాలి" అంది నాగమణి.

"అది నువ్వు చెప్పాలా. ఇప్పటికి ఎంతోమందిని పిలిపించినాను, పని నేర్పించినాను. ఇదేమన్నా కొత్తా" అంది ధీమాగా లచ్చిందేవి.

పదిహేను రోజుల్లో ఇంటినుండి పాస్పోర్ట్ కాపీలు రావడం వెంటనే వీసా తెప్పించడం జరిగిపోయింది.

"ఇంత తొందరగా పని జరుగుతుందనుకోలేదు అక్కా" అంది నాగమణి కృతజ్ఞతగా.

"నేను తలచుకుంటే అంతేమరి. వీసా ఇంటికి పంపించాను. మీ చెల్లెలికి ఫోన్ చేసి మా అమ్మకు యాభైవేలు ఇచ్చి వీసా తీసుకోమను అంది గర్వంగా" లచ్చిందేవి.

"ఇప్పటికిప్పుడు యాభైవేలంటే ఆయమ్మికి కష్టం కదక్కా. ముందే మొగుడుపోయిన బాధలో వుంది. ఇప్పుడు ఇరవై వేలు ఇస్తుందంట. ఇక్కడికి వచ్చాక ముందుగా సేటు ఇచ్చే రెండునెలల జీతాలు నువ్వే తీసుకో. వచ్చాక ఇవ్వకుండా పారిపోదు కదా" అంది నచ్చచెబుతూ నాగమణి.

"అబ్బే అదేమీ కుదరదు అమ్మీ. మాటంటే మాటే. సేటుకు నచ్చచెప్పి వీసా ఇప్పించడం తలకు మించిన పని అయింది తెలుసా. నా కష్టం నీకు తెలియదు. అదే నీకు కాబట్టి ఆయమ్మి కష్టంలో వుంది కాబట్టి యాభైవేలకు ఒప్పుకున్నాను. లేకపోతే లచ్చ రూపాయలకు ఎక్కడా ఎవరికీ తగ్గలేదు. నువ్వు ఈ మాట అప్పుడే చెప్పివుంటే ఈ వీసాను మిట్టమీద పుల్లమ్మికి పంపించేదాన్ని. ఆయమ్మి చేతిలో లచ్చరూపాయలు రడీగా పట్టుకుని ఆర్నెల్లనుండీ ఒకటే అడుగుతాంది. ఇలా అయితే నా వల్లకాదు, ఇప్పుడే మా అమ్మకు ఫోన్ చేసి వీసా ఇవ్వద్దని చెబుతాను" అంది దురుసుగా.

"అయ్యో.. నీ కాళ్ళు పట్టుకుంటా అక్కా. పోనీ ఇప్పుడు ముప్పైవేలు ఇస్తాదిలే ఒప్పుకో అక్కా అంది" దీనంగా నాగమణి.

"సరే.. వస్తానే రెండు జీతాలూ నాకే ఇవ్వాలి" అంది లచ్చిందేవి. ఇలా ఎంతమందిని పీడించి మేడలు కట్టిందో ఇది అని లోపల తిట్టుకుంటూ "సరే అక్కా.. నువ్వు ఎలా అంటే అలాగే" అంది నాగమణి.

కానీ లచ్చిందేవి బుద్ధి నీచమైనదని, డబ్బుకోసం ఎంతటి దుర్మార్గానికైనా ఒడిగడుతుందని నాగమణి గ్రహించలేకపోయింది. ఊహించి వుంటే సుబ్బరత్నను లచ్చిందేవి చేతికి అప్పగించేది కాదు.

వంటిమీద వున్న నగలు కుదువపెట్టి లచ్చిందేవి అమ్మకు ముప్పైవేలు కట్టి వీసా తీసుకుని మెడికల్

చేయించుకుంది సుబ్బరత్న. పిల్లల్ని తల్లికి అప్పగించి భవిష్యత్ బంగారురంగులో కనబడుతుంటే విమానమెక్కింది. చెల్లిని చూసి సంతోషించింది నాగమణి. లచ్చిందేవికి అప్పగించి జాగ్రత్తలు చెప్పింది. ఒక నెల బాగానే గడిచింది. తరువాత ఇంటిదగ్గర పిల్లోడికి బాలేదని తల్లి ఫోన్ చేయడంతో ఆ నెల జీతం ఇంటికి పంపించింది.
అక్కడే లచ్చిందేవితో గొడవ మొదలయింది. మాట చెప్పిన ప్రకారం డబ్బు కట్టాల్సిందేనని మొరాయించింది. ఒక్క నెల ఆగక్కా అని ఎంత చెప్పినా వినలేదు. ఆరునూరైనా, ఆకాశం ఊడి పడినా నా డబ్బు ఇవ్వాల్సిందే అని పట్టుపట్టింది లచ్చిందేవి.

సుబ్బరత్నకు కోపమొచ్చింది. "ఏమక్కా.. నీకు డబ్బు ఎగ్గొట్టి నేను కువైట్ వదిలి పారిపోతానా. ఒక్కనెల కూడా ఆగలేవా" అనింది ధైర్యంగా.
"ఏమ్మో నన్నే ఎదిరించి మాట్లాడుతున్నావా. నీకు వీసా తీసి, నిన్ను పిలిపించి పని నేర్పిస్తే ముష్టి యాభైవేలు ఇచ్చేదానికి ఇన్నిసార్లు అడగాలా.ఇంత సహాయం చేసినదానికి నువు నాకు జన్మంతా ఋణపడి వుండాలి తెలుసా" అని ఈసడించింది.
మాటామాటా పెరిగింది. సుబ్బరత్న కూడా తగ్గలేదు. దాంతో లచ్చిందేవి కక్ష పెంచుకుంది. ఇక సుబ్బరత్నకు నరకయాతన మొదలయ్యింది. సేట్లకు సుబ్బరత్న మీద లేనిపోని చాడీలు చెప్పి తిట్టించేది. పని ఎంత బాగా చేసినా వంకలు పెట్టి మరలా చేయించేది. కడిగినచోటే కడిగించేది. ఆ ఇంట్లో లచ్చిందేవి ఇరవైయేళ్ళుగా చేస్తోంది కాబట్టి సేటుకు నమ్మకం ఏర్పడింది. పనివాళ్ళందరూ సేటుకంటే కూడా లచ్చిందేవికే భయపడతారు.

నాలుగునెలలు గడిచాయి. లచ్చిందేవికి ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చేసింది. అయినా సుబ్బరత్నను ఆవిడ సాధిస్తూనే వుంది. ఆ చాకిరీ చెయ్యలేక వళ్ళు అలసిపోతోంది అయినా తప్పదు కాబట్టి ఓర్చుకుంటోంది.
విషయం నాగమణికి చెప్తే రెండేళ్ళు ఓపికగా చెయ్యి. తరువాత బయటికి తీసి నా దగ్గర పెట్టుకుంటాను. మాలియాలో శుక్రవారం సాయంత్రం వక్కాకు అమ్ముకున్నా బతకొచ్చు అని ధైర్యం చెప్పింది.

ఉప్పు నిప్పులా వుంది పరిస్థితి. కష్టంగా వుంది సుబ్బరత్నకు. ఎంత మంచిగా వున్నా లచ్చిందేవి చీటికి మాటికి తిడుతూనే వుంది. సహనం నశించిపోతోంది సుబ్బరత్నకు. ఆ ఇంట్లో పని చెయ్యడం కొరివితో తల గోక్కోవడమే అని నిర్ణయించుకుంది.
"నేను మా అక్క దగ్గరికి వెళ్ళిపోతాను" అని చెప్పింది.
"అదెలా పోతావు. రెండేళ్ళ కాంటాక్టు పూర్తి చెయ్యకుండా పోతే సేటుకు లచ్చ రూపాయలు డబ్బు కట్టాలి, కట్టేసి

పో మరి" అని నిలదీసింది లచ్చిందేవి.

"డబ్బు తప్ప ఇంకేమీ కనపడదా నీ కళ్ళకి" అనింది సుబ్బరత్న.

"కువైట్ వచ్చేదే డబ్బుకోసం. ఇంక దేనికోసమో నువ్వే చెప్పు" అని అడిగింది లచ్చిందేవి.

ఆ ఇంట్లో డ్రైవరు "లచ్చిందేవితో జాగ్రత్తగా వుండమని" సుబ్బరత్నకు చెబుతూనే వున్నాడు.

కానీ ఇద్దరిమధ్యా పోట్లాట పెరుగుతోందే కానీ తగ్గడంలేదు.

"నీ అంతు చూస్తాను చూడు" అని బెదిరించింది లచ్చిందేవి.

ఒకరోజు సేటు సుబ్బరత్నను పిలిచి "నువ్వు ఇంట్లో పని సరిగ్గా చెయ్యడం లేదు. లచ్చిందేవితో గొడవ పడుతున్నావని తెలిసింది. అందుకే ఎడారిలో మా గొర్రెల దగ్గర కాపలాకు తీసుకెళ్తాను బట్టలు సర్దుకో" అన్నాడు.

నిర్ఘాంతపోయింది సుబ్బరత్న. చేసేదేమీ లేక కారెక్కింది.

వెనక లచ్చిందేవి నవ్వుకోవడం అద్దంలోనుండి కనిపిస్తూనే వుంది.

ఎటు చూసినా ఇసుక. దిగంతాలవరకూ పరుచుకున్న విశాలమైన ఎడారి. మధ్యలో గొర్రెల దొడ్డి. అక్కడ అప్పటికే బంగ్లాదేశ్ నుండి వచ్చిన దంపతులు వుంటున్నారు. వారికి సహాయంగా సుబ్బరత్నను తీసుకొచ్చాడు సేటు. ప్రపంచానికి, మనుషులకు దూరంగా రొట్టెముక్కలు తింటూ గొర్రెలు మేపుకుంటూ కాలం గడపాలి. ఇదొక రకమైన శిక్ష. మాట వినని వాళ్ళకు వేసే కఠినమైన శిక్ష.

ఆ బెంగాలీ వాళ్ళిద్దరూ దుమ్ము కొట్టుకుని పోయి వారి బట్టలు అవీ ఎడారి ఇసుక కమ్ముకుని ఎర్రగా భయంకరంగా కనబడుతున్నారు. వారికి మరో మనిషి తోడు దొరికిందని సుబ్బరత్న వైపు ఆనందంగా చూసారు. మనుషుల్ని నమిలి తినే నరమాంస భక్షకుల్లా కనిపించి సుబ్బరత్నకు భయమేసింది.

అక్కడ తిండి వుండదు. ఎండిన రొట్టెముక్కలు తప్ప. అవి కూడా సేటు ఏ వారానికో నాలుగు పేకెట్లు తెచ్చి వేస్తాడు. నీళ్ళుండవు. సేటు తెచ్చే డ్రమ్ము నీళ్ళు తాగడానికే చాలవు. ఇక స్నానం సంగతి మరిచిపోయి చాన్నాళ్ళయింది. నరకం అంటే ఇదేనేమో అనిపించింది సుబ్బరత్నకు.

లచ్చిందేవి తన కోపాన్ని ఇలా తీర్చుకుంటుందని ఇంత కఠినంగా వ్యవహరిస్తుందని ఊహించలేదు. ఈ ఎడారిలోనే ప్రాణం పోయేట్లుంది. అక్క నాగమణికి ఫోన్ చేద్దామంటే ఫోన్ లేదు.

బయటి ప్రపంచంతో, మనుషులతో సంబంధాలు తెగిపోయాయి. మట్టికొట్టుకున్న మర మనిషిలా గొర్రెలు కాస్తూ యాంత్రికమైన జీవితం గడుపుతోంది. ఈ చెర నుండి విముక్తి ఎప్పుడో, ఇంటికి వెళ్ళి పిల్లల్ని చూసేది ఎప్పుడో అనుకుంటే ఏడుపొచ్చింది సుబ్బరత్నకు. ఇక్కడ నాగమణికి సుబ్బరత్న జాడ తెలియలేదు. లచ్చిందేవిని అడిగితే

నాకు తెలియదు. మీ చెల్లెలు ఇంట్లోంచి పారిపోయి ఇంట్లోంచి పారిపోయి నెల దాటింది. ఎటుపోయిందో తెలియక మరలా పనిమనిషి కావాలి కాబట్టి మిట్టమీది పుల్లమ్మిని పిలిపించాను. మీ చెల్లెలు కువైట్ లో ఎక్కడ వుందో వెతుక్కో అని చెప్పింది. సుబ్బరత్న ఏమయిందో తెలియక నాగమణి అల్లాడిపోయింది.

దాదాపు సంవత్సరం గడిచాక బంగ్లాదేశ్ దంపతులు పారిపోదామని ప్లాన్ వేసారు. నువ్వు వస్తే కలిసి పోదాం అన్నారు. అంత కంటే గత్యంతరం లేదు. జనవాసాలున్న వైపు ముగ్గురూ ఆ ఎడారిలో పరుగు తీసారు. రెండురోజులు నిర్విరామంగా ప్రయాణం చేసిన వాళ్ళు ఎంబసీకి చేరుకున్నారు.అస్థిపంజరంలా వున్న సుబ్బరత్నను చూసి ఇండియన్ ఎంబసీలోని వాళ్ళు భయపడ్డారు. ఆమెకు స్నానం చేయించి బట్టలిచ్చి సపర్యలు చేసాక కాస్త కోలుకుంది. తరువాత ఇంటికి పొమ్మని చెప్పి ఇండియా విమానం ఎక్కించారు.

సుబ్బరత్న ఇల్లు చేరిందే కానీ రెండునెలలు మనిషి కాలేకపోయింది. కోలుకోలేకపోయింది. జరిగిన సంఘటనలే కళ్ళముందు మెదులుతున్నాయి. నట్టింట్లో మంచమ్మీద పడుకుని పిచ్చి చూపులు చూడసాగింది. వెళ్ళి సంవత్సరం కూడా కాలేదు. బిడ్డ తిరిగి రావడంతో తల్లికి ఏమీ అర్థం కాలేదు. చుట్టుపక్కల వాళ్ళంతా ఊహాగానాలతో గుసగుసలాడుకుంటున్నారు. దొంగతనం చేసి పట్టుపడిందని ఒకరు, అక్కడ సేటునే ఎదిరించిందని మరొకరు చెప్పుకోసాగారు.

ఒకరోజు తెల్లారేసరికి దిగువ వీధిలోని లచ్చిందేవి అమ్మ లబో దిబోమని ఏడుస్తుంటే ఊరంతా వెళ్ళారు. "లచ్చిందేవి కువైట్ నుండి పంపిన నలభై తులాల బంగారం, వీసాలు అమ్మి సంపాదించిన నాలుగు లక్షల డబ్బు రాత్రికిరాత్రే ఎవరో దోచుకుపోయారని" చెపుతూ ఆమె శోకాలు పెడుతోంది.

అదేరోజు రాత్రి లచ్చిందేవి పశువుల కొట్టం కూడా కాలిపోయింది. గొడ్లన్నీ పారిపోయాయి.పోలీసులు వచ్చి కేసు రాసుకున్నారు కానీ ఎవరు చేసారో అంతుపట్టలేదు. దొంగ దొరకలేదు. ఆ తరువాత కొన్నిరోజులకు సుబ్బరత్న కోలుకుని లేచి తిరగసాగింది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments